## క్లుప్తంగా

### 'మీ కోసం' నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మీ కోసం సంస్థ ప్రతినిధులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులు, పేదలకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ దినసరి వేతనం తీసుకుంటూ జీవనోపాధి పొందుతున్న పలువురు యువకులు సేవ చేయాలనే తపనతో మీ కోసం స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి నెల నెలా పేదలకు నిత్యావసర సరుకులు అందించడంతో పాటు రక్తదాన శిబిరాల ద్వారా ఆపదలో ఉన్న వారికి రక్తందానం చేయడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు, అడబాల రత్న ప్రసాద్, డాక్టరు దీప్తి, రేలంగి బాపిరాజు, రాజు, నాని, తదితరులు పాల్గొన్నారు.

### ఆటపాటలతో బోధించండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి



పెనుగుదురు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆదిలక్ష్మి

కరప: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను మానసికంగా సంసిద్ధులను చేసి, ఆటపాటలతో విద్యాబోధన చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి సూచించారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆమె మండలంలోని పెద్దాపురప్పాడు, కొంగోడు, పెనుగుదురు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీచేసి సిబ్బందికి సూచనలిచ్చారు. కాన్వెంట్లతో దీటుగా విద్యాబోధన మెరుగుపరచాలని, గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య గడువు తేదీ పొడిగించడానికి రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రిన్సిపల్ సెక్రటరీలకు లేఖ రాసినట్టు ఆదిలక్ష్మి వివరించారు. సీడీపీఓ జి.వెంకటరమణ, గొర్రిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి ఆమె వెంట ఉన్నారు.

### 108 మంది రక్తదానం



బీసీ హాస్టల్‌లో బాలికలకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న స్వరూప్

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన యువ పారిశ్రామిక వేత్త ముమ్మిడి స్వరూప్ జన్మదినం సందర్భంగా స్నేహితులతో కలసి బుధవారం వివిధ సేవా కార్యక్రమాలు చేశారు. శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సతీష్ ఆధ్వర్యంలో 108 మంది స్వరూప్ స్నేహితులు రక్తదానం చేశారు. అలాగే కాకినాడ జగన్నాథపురం బీసీ బాలికల వసతి గృహంలో చదువుతున్న 50 మంది బాలికలకు హాట్ అండ్ కోల్డ్ వాటర్ బాటిళ్లు ఇచ్చారు. అనంతరం అల్పాహారం, మధ్యాహ్నం జీజీహెచ్ ఆవరణలో 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

### 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం

కొత్తపల్లి: సముద్రంలో చేపల వేట నిషేధం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ అమలులో ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. అమీనాబాదు తీర ప్రాంతంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వేట నిషేధంపై ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. జిల్లాలో 4645 బోట్లు ఉన్నాయన్నారు. వీటిలో మెకనైజ్డ్ 467, మోటరైజ్డ్ 3779, సాంప్రదాయ బోట్లు 399 ఉన్నాయని వివరించారు. వేట నిషేధ సమయంలో 61 రోజుల పాటు సంప్రదాయ బోట్లు మినహా మిగిలిన బోట్లపై వేటకు వెళ్లరాదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే వలలను ఉపయోగించాలన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా కోసం ఈ నెల 17న ఎన్యుమరేషన్ కార్యక్రమం చేపడతామన్నారు. బోట్లు నిలిపే ప్రదేశానికి బోటు యజమాని, కళాసీలు తప్పని సరిగా హాజరు కాలన్నారు. బోటు రిజిస్ట్రేషన్ ఫారం, సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు జిరాక్స్‌లు తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. వేట నిషేధం అమలుపై తీర గ్రామాల్లో టాంటాం వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీ శ్రావణి, మత్స్యశాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆటా.. పాటా.. పఠనం..

- సెలవులు సద్వినియోగం చేసుకునేలా
- గ్రంథాలయాలకు కొత్త పుస్తకాల శోభ
- ఉమ్మడి జిల్లాకు 4,280 పుస్తకాల సరఫరా
- వేసవి శిబిరాలకు సిద్ధమవుతున్న అధికారులు

బాలాజీచెరువు: గ్రంథాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త పుస్తకాలతో వాటిక కొత్త కళ తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో రూ.కోటి 2 లక్షలతో లక్ష ఆరు వేల పుస్తకాలు కొనుగోలు చేశారు. వీటిని అన్ని గ్రంథాలయాలకు పంపిణీ చేయగా నగరంలో ఉన్న ప్రధాన గ్రంథాలయంతో పాటు మూడు ఉప గ్రంథాలయాలకు, ఎనిమిది పుస్తక నిక్షిప్త కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రధాన గ్రంథాలయంలో 1800, గాంధీనగర్ శాఖకు 1820 , జగన్నాథపురం శాఖకు 600, ఆనందభారతి గ్రౌండ్ గ్రంథాలయానికి 600 పుస్తకాలు పంపిణీ చేశారు. కొత్తగా వచ్చిన పుస్తకాలు చిన్నారులు, విద్యార్థులను కట్టిపడేస్తున్నాయి. సాయంత్రం వేళ వారు సమీప గ్రంథాలయానికి వచ్చి దాదాపు గంట సేపు తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుతున్నారు. కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథల పుస్తకాలతో పాటు పోటీపరీక్షల పుస్తకాలు, పాలిటెక్నిక్, ఎంసెట్, లాసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఆధ్యాత్మికం, వినోదం పంచే పుస్తకాలు ఉన్నాయి.



'చదవడం మాకిష్టం'లో పాల్గొన్న విద్యార్థులు



చదవడానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

#### బొమ్మలతో కూడిన కథలు



బొమ్మలతో కూడిన కథలు బాగున్నాయి. ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరవనితల చరిత్రలతో కూడిన పుస్తకాలు బాగున్నాయి. ప్రతి రోజూ స్నేహితులతో వచ్చి పుస్తకాలు చదువుతాను. వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొనడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– వరుణ్‌కుమార్, 9వ తరగతి

#### చాలా బాగున్నాయి



కొత్తగా వచ్చిన పుస్తకాల్లో కథలు చాలా బాగున్నాయి. అడవులు, జంతువులు, పక్షులు, అడవి మృగాల మధ్య జరిగే సంభాషణ, పోటీ కథలు ఆసక్తిగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రతి ఆదివారం 'చదవడం మా కిష్టం'లో అందరితో పాల్గొని చదవడం సంతోషంగా ఉంటుంది.

– మాల్యశ్రీ, 9వ తరగతి

#### సబ్‌జైలులో పుస్తక పంపిణీ కేంద్రం..



రాష్ట్రంలో ప్రప్రథమంగా కాకినాడ సబ్‌జైలులో పుస్తక పంపిణీ కేంద్రం ఏర్పాటుచేశాం. దేశ నాయకులు, సత్ప్రవర్తన కలిగే పుస్తకాలు ఉంచాము. ప్రతి ఆదివారం 'చదవడం మాకిష్టం' నిర్వహించి చిన్నారులు పాల్గొనేలా కృషిచేస్తున్నాం. ఈ ఏడాది గ్రంథాలయాల వేసవి శిబిరానికి అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాము.

– ములంపాక శ్రీనివాసరావు, లైబ్రేరియన్, గాంధీనగర్

### ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయండి

- కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రోగులకు నగదు రహిత వైద్యం అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య శ్రీ సేవల్లో నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక ఆరోగ్యమిత్ర విధులకు సరిగా హాజరు కాని కారణంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఆర్ రమేష్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ స్వప్న, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ కె.నవీన్, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఒమిక్రాన్‌తో అప్రమత్తం

కాకినాడ రూరల్: ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌తో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగ ఉండాలని వైద్యురాలు దీప్తి అమరా పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె ఆరోగ్య సూచనలు సలహాలు ఇచ్చారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

# గడప గడపలో సందడే సందడి



ప్రభుత్వ పథకాలపై గృహ యజమాని అభిప్రాయం తెలుసుకుంటున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి



'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న తదితరులు

- ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'
- పార్టీలో పండుగ వాతావరణం

కాకినాడ: ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్' సందడిగా సాగుతోంది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచన మేరకు ఆయా డివిజన్లలో ముఖ్యనేతలు, కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న ఆయా డివిజన్లలో పర్యటించి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా ఉల్లంఘించిందో వివరిస్తూ, అదే సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. పార్టీ నాయకులు సుంకర సాగర్, మల్లిపాముల గణపతి, గోడి వెంకట్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, ఆమెతో పాటు ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ఆధ్వర్యంలో జగన్నాథపురం ప్రాంతంలో మాజీ కార్పొరేటర్లు ఎంజీకే కిశోర్, జగన్నాథన్ విజయ్‌కుమార్, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ పర్యవేక్షణలో మరికొన్ని డివిజన్లలో 'జగనన్నే మా భవిష్యత్' కొనసాగుతోంది. స్థానిక 22వ డివిజన్ నుంచి 37వ డివిజన్ వరకు ఆయా ప్రాంతాల్లో పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణు, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. 39 నుంచి 40వ డివిజన్ వరకు ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీతో పాటు మాజీ కార్పొరేటర్లు బాలాప్రసాద్, కొలగాని దుర్గాప్రసాద్, ఇనుకొండ బాబు, రాజారపు కృష్ణ పర్యవేక్షిస్తున్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన ప్రశ్నావళిని ప్రజల ముందు ఉంచి వారి అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నారు. వెళ్లిన ప్రతి ఇంటికీ జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను అతికిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోంది. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైఎస్ జగన్ పాలనలో అందుకుంటున్న పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రభుత్వ పాలనపై సంతృప్తిని తెలియజేస్తున్నారు.

# విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

- ఎంపీ వంగా గీత
- చార్టీస్ అభివృద్ధికి శ్రీకారం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, నేతలు



చార్టీస్‌లో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చార్టీస్ ఆవరణలో రూ.50 లక్షల సీఎం అభివృద్ధి నిధులతో నిర్మించిన రహదారులు, అంతర్గత రహదారులు, క్రీడా పరికరాలను ఎమ్మెల్యే ద్వారంపూడి, పలువురు ప్రజా ప్రతినిధులతో ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో కొత్తగా ఏడు లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ముందుకు రావడం ఏపీలో విద్యా సంస్కరణలకు అద్దంపడుతోందని గీత అన్నారు. 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎంఎస్ఎన్ చార్టీస్ అభివృద్ధికి ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవ అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ విద్యాదాత నాయకర్ ముందుచూపుతో సుమారు 1150 ఎకరాలను కేటాయించి దానిపై వచ్చే ఆదాయంతో ఎంతో మంది పేదల విద్యకు దోహదపడ్డారన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన చార్టీస్ ఎంతో నిర్లక్ష్యానికి గురైన పరిస్థితుల్లో స్థానిక నాయకుల విజ్ఞప్తి మేరకు సీఎం అభివృద్ధి నిధులను తెచ్చి అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు. నాయకర్ సేవలకు గుర్తింపుగా ఆయన వర్ధంతి, జయంతులను కార్పొరేషన్ పరంగా అధికారంగా చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంతో పేరున్న చార్టీస్ ప్రాంతాన్ని అధునాత హంగులతో చక్కని క్రికెట్ గ్రౌండ్‌గా అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి ప్రసాద్, కాకినాడ జిల్లా మహిళాధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, చార్టీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రాజెక్టుకు జాతీయ పురస్కారం

- ఫైన్‌లో ప్రదర్శనకు పేటెంట్ హక్కు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భవన నిర్మాణంలో సీలింగ్‌కు ప్లాస్టింగ్ చేయడంలో తాపీ మేస్త్రికి ఎంతో ఉపయోగపడేలా రూపొందించిన మెషీన్ ఫర్ ది మేసన్ ప్రాజెక్టుకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చింది. స్థానిక నెహ్రూ పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిదుర్గాప్రసాద్, గైడ్ ఎస్ఎస్ఎస్ భవాని రూపొందించిన ఈ ప్రాజెక్టును ఇన్‌స్పైర్–మనక్ 2021–21 పోటీల్లో ప్రదర్శించగా రాష్ట్రానికి వచ్చిన మూడు జాతీయస్థాయి అవార్డుల్లో ఇదీ ఒకటిగా నిలిచింది. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రం ఢిల్లీలో ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–23 (ఫైన్)లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 658 ప్రాజెక్టులలో 60 ప్రాజెక్టులు ఎంపిక చేశారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. సీలింగ్ ప్లాస్టింగ్‌లో సులువుగా గడంచిలను రిమోట్ సాయంతో జరపడం, తక్కువ సిమెంట్ ఉపయోగించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలని వారు తెలిపారు.



మెషీన్ ఫర్ ది మేసన్ ప్రాజెక్టుతో విద్యార్థి దుర్గాప్రసాద్, గైడ్ ఎస్ఎస్ఎస్ భవానీ

### విద్యా కానుకలు సక్రమంగా పంపిణీ చేయాలి

- ఆర్జేడీ నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక కిట్లను సంక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ జి.నాగమణి కోరారు. మండలంలోని వాకలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించి స్టాక్ పాయింట్ ఏర్పాటుకు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని సుమారు 10252మంది విద్యార్థులకు కిట్ల పంపిణీకి అవసరమైన సన్నాహక సమావేశాన్ని ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కేంద్రం నుంచి కిట్లు తీసుకోవడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. హెచ్‌ఎం సూర్యనారాయణ, చామంతి నాగేశ్వరరావు, వెలుగు ఏపీఎం సత్యనారాయణ, సీఆర్పీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

### ఘనంగా సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం



సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: నవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి దేవస్థానంలో సామాజ్య పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం స్వర్ణ కిరీట ధారణ, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. పాణింగపల్లి మాధవాచర్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి ఏర్పాట్లు చేశారు.

# సేవ ఒక వరం : ఎంపీ గీత



వినికిడి యంత్రాలు అందజేస్తున్న ఎంపీ గీత

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సేవ చేయడం ఒక వరం . సేవా కార్యక్రమాలు చేయడం చాలా కష్టమని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక చల్లా కల్యాణమండపంలో బుధవారం దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్, తోట సుబ్బారావు రూరల్ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాల పంపిణీ నిర్వహించారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ సీఎస్సార్ నిధులతో యంత్రాలు సమకూర్చారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవల్లో ఎన్జీఓల పాత్ర కీలకమన్నారు. సీఎస్సార్ నిధుల ద్వారా పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఎన్నో విధాలుగా సేవలందిస్తున్నాయని ఆ సేవలు నిరంతరం అందించి ప్రజలు మన్ననలు పొందాలన్నారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ డీజీఎం సంజీవ రణదేవ్ మాట్లాడుతూ తాము కాశ్మీర్ నుంచి అన్ని రాష్ట్రాల్లోను సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఎస్సార్ నిధులతో వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దీన్‌దయాళ్ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు, తోట సుబ్బారావు రూరల్ అభివృద్ధి సంస్థ అధ్యక్షులు తోట సర్వారాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ నాయకులు మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.5 కోట్లతో రామాలయాల అభివృద్ధి



కరప ఎస్సీ వీధిలో శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

కరప: మండల పరిధిలో రామాలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.4.5 కోట్లు మంజూరు చేశారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాల మేరకు అన్నవరం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు డీఈఈ ఎన్. ఉదయ్‌కుమార్, ఏఈఈ పి.అభినయ్, స్థానిక నాయకులతో కలసి బుధవారం వారు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎక్కడెక్కడ రామాలయాలు నిర్మించాలి, పునర్నిర్మించాలి అనే విషయమై పరిశీలించారు. మండల పరిధిలో 45 రామాలయాలను అభివృద్ధి చేసేందుకు శ్రీవాణి పథకంలో టీటీడీ ఒక్కొక్కదానికి రూ.10 లక్షల వంతున మంజూరు చేసినట్టు జెడ్పీటీసీ తెలిపారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, రావుల ప్రసాద్, వెలుగుబంట్ల నారయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# తుదిదశకు చేరుకున్న టోర్నీలు



వేళంగిలో సాగుతున్న క్రికెట్ మ్యాచ్

కరప: మండలం వేళంగిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రమ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు తుది దశకు చేరుకున్నాయి. మంగళవారం రాత్రి వాలీబాల్ రెండు సెమీఫైనల్స్ జరిగాయి. మొదటి సెమీ ఫైనల్లో వేళంగి ఈగల్స్‌పై వేళంగి అవెంజర్స్, రెండో మ్యాచ్‌లో వేళంగి రైడర్స్‌పై వేళంగి ఫైటర్స్ గెలుపొంది ఫైనల్స్ చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్ 16న జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. క్రికెట్‌లో రెండు సెమీ ఫైనల్స్ జరగ్గా, మొదటి సెమీఫైనల్‌లో వేళంగి లయన్స్‌పై వేళంగి టైగర్స్ జట్టు విజయం సాధించింది. గెడ్డం శేఖర్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. రెండో మ్యాచ్‌లో వేళంగి నైట్ రైడర్స్‌పై వేళంగి వారియర్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎర్రా విక్రమ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. గురువారం వేళంగి టైగర్స్, వేళంగి వారియర్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# రవీంద్రనాథ్‌బాబుకు వీడ్కోలు




రవీంద్రనాథ్‌బాబును సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న ఎం.రవీంద్రనాథ్‌బాబుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఘన వీడ్కోలు పలికింది. కాకినాడ పోలీస్ రిజర్వు లైన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నూతన ఎస్పీ సతీష్‌కుమార్, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్‌రాజు, అదనపు ఎస్పీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్పీగా జిల్లాకు రవీంద్రనాథ్‌బాబు చేసిన సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఏఆర్ అదనపు ఎస్పీ సత్యనారాయణ, కాకినాడ అదనపు కమిషనర్ నాగనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### డిమాండ్ల పరిష్కారం కోరుతూ ధర్నా

కాకినాడ సిటీ: పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారించాలని కోరుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు బుధవారం ధర్నా చేశారు. ప్రతి నెలా ఒకటి లేదా రెండో తేదీన పెన్షన్ చెల్లించాలని, బకాయి ఉన్న డీఆర్ ఎరియర్స్ సత్వరమే చెల్లించాలని తదితర డిమాండ్లు చేశారు. ఉద్యమానికి సహకరిస్తున్న జిల్లా జేఏసీ చైర్మన్ త్రినాథరావుకి, దుర్గాప్రసాద్‌లకు ఆందోళనకారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ ధర్నాలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పద్మనాభం తెదితరులు పాల్గొన్నారు.

### కులగణనకు కమిటీ ఏర్పాటు హర్షణీయం

కాకినాడ సిటీ: రాష్ట్రంలో కులగణనపై అధ్యయనానికి సీఎం జగన్ రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంపై శెట్టిబలిజ జనజాగృతి నాయకుడు పితాని నూకరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌కు ధన్యవాదాలు చెప్తున్నట్టు నూకరాజు వివరించారు.

# వేంకటేశుని కల్యాణ వైభోగం



పెనుగుదురులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లు

కరప: పెనుగుదురులోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి దివ్యకళ్యాణం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి, రాత్రి కల్యాణం చేశారు. సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి, రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు బండారు సుజాత, వెంకటేశ్వరరావు దంపతులు, గ్రామస్తులు కళ్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.